మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

## గవర్నర్ అవార్డు, గోల్డ్ మెడల్ ను పొందిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



4

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 07 సంచిక : 351 శుక్రవారం 09 - 05 - 2025 పేజీలు: 8 వెల: 4

# సంచలన తీర్పు




- వైకాపా నేత చెరుకులపాడు నారాయణ రెడ్డి హత్య కేసులో 11 మందికి జీవిత ఖైదు
- ఒక్కొక్కరికి రూ.1,000ల జరిమానా
- మరో 5 మందిపై కేసు కొట్టివేత
- తీర్పు వెలువరించిన జిల్లా కోర్టు న్యాయస్థానం



మన గళం,కర్నూలు ప్రత్యేక ప్రతినిధి : కర్నూలు జిల్లా కోర్టు గురువారం సంచలన తీర్పును వెలువరించింది. కర్నూలు ఉమ్మడి జిల్లాల్లోనే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనాన్ని కలిగించిన వైకాపా నేత చెరుకులపాడు నారాయణ రెడ్డి, అతని ప్రధాన అనుచరుడు బోయ సాంబ శివుడు డబల్ మర్డర్ కేసులో కర్నూల్ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఈ తీర్పును వెలువరిచింది. 2017, మే 21న ఈ దారుణ హత్య జరిగింది. ఈ నేపధ్యంలో అప్పట్లో కృష్ణగిరి పోలీస్ స్టేషన్ లో సి.ఆర్.నెం.46/2017, అండర్ సెక్షన్ 147,148,302,109 ఐపిసి 3,5 ఇ.ఎస్.యాక్ట్ ఎస్.సి.నెం. 18/2019,పిఆర్సీ. 9/18,కింద కేసు నమోదైంది. ఈ నేపధ్యంలో 17 మంది ముద్దాయిలపై ప్రధానంగా కేసు విచారణ సాగింది. ఈ కేసు విచారణ దశలో ఉండగనే, ఈ కేసులో ముద్దాయిగా ఉన్న ఏ4 మరణించాడు. దాదాపుగా 8 ఏళ్ల సుధీర్ఘ కాలం పాటు కొనసాగిన విచారణ గురువారం తుది దశకు వచ్చింది. ఈ క్రమంలో గురువారం జిల్లా కోర్టుకు 16 మంది ముద్దాయిలు హాజరవగా, వారిలో 11 మందికి జీవిత ఖైదు, అంతే కాకుండా ఒక్కొక్కరికి రూ.1,000ల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కబర్ది తీర్పు చెప్పారు. మరో 5మంది ముద్దాయిలకు సంబంధించి సరైన సాక్ష్యాలు లేనందున వారిపై కేసు కొట్టి వేశారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరెడ్డి వాదించారు. 2




పాక్ మీడియా కంటెంట్‌పై

## భారత్ నిషేధం

### ఓటీటీల్లో పాక్ సిరీస్‌లు బంద్

మన గళం, న్యూఢిల్లీ : దేశ భద్రత దృష్ట్యా భారత ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పాకిస్థాన్‌లో రూపొందిన మీడియా ప్రసారాలపై భారత్‌లో నిషేధం విధిస్తూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ 2

లబోదిబోమంటూ

## పాక్ ప్రెస్ మీట్



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: ఆపరేషన్ సిందూర్ అప్‌డేట్స్: కరాచీ, లాహోర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు 2

భూమి పూజ వేళ

## ఎల్జీ ప్రతినిధుల సంస్కారం

- శ్రీ సిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు భూమి పూజ
- మంత్రి లోకేశ్ విజ్ఞప్తితో పాదరక్షలు తీసిన ఎల్జీ ప్రతినిధులు
- భారతీయ సంప్రదాయాలకు కొరియన్ల గౌరవం



మన గళం, అమరావతి : ఇవాళ శ్రీ సిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్ భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఏపీ ఎలక్ట్రానిక్స్, ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్, ఎల్జీ ప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమం భారతీయ సంప్రదాయాల ప్రకారం జరిగింది. ఈ సందర్భంగా ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. భూమి పూజ స్థలికి విచ్చేసిన ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కొరియన్ ప్రతినిధులు పాదరక్షలతోనే 2

కీలక నిర్ణయాలు

## తీసుకున్న ఏపీ కేబినెట్

- ఏపీ రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ తీర్మానం
- వేదికలపై తన పక్కన పవన్ కల్యాణ్ కూర్చునేలా ఏర్పాట్లు



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనేక కీలకమైన నిర్ణయాలకు ఆమోదముద్ర లభించింది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు, పరిపాలనా పరమైన పలు అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి కీలక తీర్మానాలు చేసింది. రాష్ట్ర మంత్రివర్గం 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం 2



ఆపరేషన్ సిందూర్‌పై స్పందించిన

## పహల్గాం మృతుడి భార్య

మన గళం, న్యూఢిల్లీ : పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైన్యం చర్యలు చేపట్టంది. ఈ చర్యలపై పహల్గాం దాడిలో మరణించిన మధుసూదన్ రావు భార్య కామాక్షి ప్రసన్న గురువారం కేరళలో స్పందించారు. 2



లిక్కర్ స్కాంలో కొత్త మలుపు..

## రంగంలోకి ఈడీ

మన గళం, అమరావతి : ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎంట్రీ ఇచ్చింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద కేసు నమోదుకు రంగం సిద్ధం చేసింది ఈడీ. పీఎమ్ఎల్ఏ సెక్షన్ కింద కేసు నమోదుకు తమకు డాక్యుమెంట్లు కావాలని సిట్ అధిపతి, విజయవాడ సీపీకి ఈడీ లేఖ రాసింది. అలాగే కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్, ఇప్పటి వరకు సీజ్ చేసిన బ్యాంక్ అకౌంట్లు వివరాలు పంపాలని ఈడీ కోరింది. రాష్ట్రంలో పెను దుమారం రేపుతోన్న లిక్కర్ స్కాంకు 2

పాకిస్థాన్‌కు రేవంత్ రెడ్డి

## వార్నింగ్




మన గళం, హైదరాబాద్ : ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని దయాది దేశం పాకిస్థాన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ 2

## ఎవరినీ వదలం



మన గళం, అమరావతి : వైసీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, అలాంటి పోలీసు అధికారుల పేర్లు రాసుకోవాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని, 'జగన్ 2.0'లో వారికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ, పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలానికి చెందిన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ 2

ఉద్రిక్తతలు.. నష్టాల్లో

## భారత స్టాక్ మార్కెట్



### భారత్-పాక్ ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం

మన గళం, న్యూఢిల్లీ : భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ 2

ఆపరేషన్ సిందూర్‌పై స్పందించిన

# పహల్గాం మృతుడి భార్య

మొదటిపేజీ తరువాయి దాయాది దేశం పాకిస్థాన్‌పై కేంద్రం ఈ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టడాన్ని ఆమె స్వాగతించారు. ఈ చర్య బాధిత కుటుంబాలకు కొంత సాంత్వన కలిగిస్తుందన్నారు. అయితే పహల్గాం ఉగ్ర దాడిలో తాము భర్తలను కోల్పోయమని ప్రజలంతా భావిస్తున్నారని.. కానీ తాము జీవితాలనే కోల్పోయామని ఈ సందర్భంగా ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. పహల్గాం దాడిలో 26 మంది మరణించడంతో.. దేశంలో ఏ ఒక్కరు సంతోషంగా లేరని ఆమె పేర్కొన్నారు.

ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ దాడిలో 26 మంది మరణించారు. ఈ దాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ చేపట్టింది. ఈ విచారణలో భాగంగా బాధిత కుటుంబాలను కలిసి.. పహల్గాం ఉగ్రదాడి ఎలా జరిగింది, ఉగ్రవాదులు కాల్పులు జరిపే ముందు ఏం చేశారు.. ఎలా వ్యవహరించారు.. ఏమని ప్రశ్నించారంటూ ఎన్ఐఏ బృందాలు వారికి ప్రశ్నలు సంధించారు. అలా దాదాపు అన్ని బాధిత కుటుంబాలను ఈ బృందాలు ప్రశ్నించాయి. మరోవైపు ఈ ఉగ్రదాడితో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కి సంబంధాలున్నాయనే సాక్ష్యాలను భారత్ సంపాదించింది. దీంతో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ క్రమంలో బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భీకర దాడులను భారత సైన్యం చేపట్టింది. ఈ చర్యకు ఆపరేషన్ సిందూర్ అనే పేరును కేంద్రం పెట్టింది. ఈ ఆపరేషన్ సిందూర్‌పై కామాక్షి ప్రసన్నపై విధంగా స్పందించారు. ఇంకోవైపు ఈ ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన కల్నల్ సోఫియా ఖురేషికి అన్ని వర్గాల నుంచి ప్రశంసలు అందుతోన్నాయి. ఆమె కుటుంబ సభ్యులు సైతం సోఫియా పాత్రను అభినందిస్తున్నారు.

# లబోదిబోమంటూ పాక్ ప్రెస్ మీట్

మొదటిపేజీ తరువాయి క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్ కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు పాకిస్థాన్ ప్రకటించగా, ఇస్లామాబాద్, లాహోర్‌లలో “సాంకేతిక కారణాల వల్ల” కొంత సమయం మూసివేసినట్లు పాకిస్తాన్ పౌర విమానయాన సంస్థ తెలిపింది.

# పాక్ మీడియా కంటెంట్‌పై భారత్ నిషేధం

మొదటిపేజీ తరువాయి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఓటీటీ వేదికలతో పాటు, ఇతర డిజిటల్ మీడియా మాధ్యమాల్లో ప్రసారమయ్యే పాకిస్థానీ వెబ్‌సిరీస్‌లు, సినిమా పాటలు, పాడ్‌కాస్ట్‌ల వంటి కంటెంట్‌ను తక్షణమే నిలిపివేయాలని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ నిషేధాజ్ఞలు వెంటనే అమల్లోకి వస్తాయని, సంబంధిత వేదికలు దీన్ని కచ్చితంగా పాటించాలని సూచించింది. ఇకపై భారతీయ ప్రేక్షకులు పాకిస్థానీ కంటెంట్‌ను అధికారికంగా వీక్షించే వీలుండదు.

# సంచలన తీర్పు



మొదటిపేజీ తరువాయి

**కిట,కిటలాడిన...కోర్టు పరిసరాలు** : కేసు తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈ కేసులో ముద్దాయిలుగా ఉన్న వారి బంధు,మిత్రులు పెద్ద ఎత్తున కోర్టు పరిసరాల్లోకి చేరుకున్నారు. ఈ క్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా,తగిన బందోబస్తు చర్యలు చేపట్టింది. కోర్టు పరిసరాల్లో బారికేడ్లను ఏర్పటు చేసి, కోర్టు ప్రాంగణంలోనికి ఎవ్వరినీ రానీయకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అయితే...తీర్పు వెలువడగానే ఒక్కసారిగా కోర్టు పరిసరాలు శిక్ష పడిన ముద్దాయిల బంధు,మిత్రుల రోదనలతో, ఆక్రందనలతో మార్మోగిపోయింది. జీవిత శిక్ష పడిన ముద్దాయిలు తమను అన్యాయంగా ఈ కేసులో ఇరికించారంటూ రోదించారు. ఇదే సందర్భంలో జీవిత శిక్ష పడిన ఓ ముద్దాయి బస్సులో ఉన్న అద్దానికి తల కొట్టుకోవడంతో పోలీసులు ఒక్కసారిగా అలర్టై,అతన్ని నిలువరించేందుకు తంటాలు పడ్డారు.

# ఉద్రిక్తతలు.. నష్టాల్లో భారత స్టాక్ మార్కెట్

మొదటిపేజీ తరువాయి మార్కెట్లను కుదిపేశాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం చేపట్టిన చర్య అనంతరం, పాకిస్థాన్ వైపు నుంచి సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు ప్రయత్నాలు జరిగాయి. దీనికి ప్రతిగా భారత దళాలు పాకిస్థాన్‌లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడుల్లో లాహోర్‌లోని పాకిస్థాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైందని భారత రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ, చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి తీవ్రరూపం దాల్చడంతో సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. ఫలితంగా సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా పతనమవ్వగా, నిఫ్టీ కీలకమైన 24,300 స్థాయికి దిగువన ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నప్పటికీ, దేశీయ సూచీలు ఉదయం ఉత్సాహంగానే మొదలయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు 80,746.78 పాయింట్లతో పోలిస్తే, 80,912.34 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య కదలాడిన సూచీ, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగాయన్న వార్తలతో చివరి గంటలో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనైంది. చివరకు సెన్సెక్స్ 411.97 పాయింట్ల నష్టంతో 80,334.81 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ కూడా 140 పాయింట్లు కోల్పోయి 24,273.80 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 85.72 వద్ద కొనసాగుతోంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.95 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.43 శాతం మేర క్షీణించాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, టాటా మోటార్స్ షేర్లు లాభాలతో ముగిశాయి.

– పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ప్రకంపనలు

భారత సైనిక చర్యల దెబ్బకు పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ కుదేలైంది. 'ఆపరేషన్ సిందూర్' ప్రభావంతో నిన్న భారీగా నష్టపోయిన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (పీఎస్ఎక్స్), నేడు ట్రేడింగ్ సమయంలో అరగంట పాటు నిలిచిపోయింది. కరాచీ సమీపంలో భారత సైనిక దళాలు విరుచుకుపడ్డాయన్న వార్తలు వ్యాపించడంతో మదుపరులు భయాందోళనలకు గురై, అమ్మకాలకు తెగబడ్డారు. ట్రేడింగ్ నిలిపివేతకు ముందు కేఎస్ఈ 100 సూచీ ఏకంగా 6,948 పాయింట్లు (6.32 శాతం) పతనమై 103,060 వద్ద నిలిచింది. కొంత సమయం తర్వాత ట్రేడింగ్ పునఃప్రారంభమైనప్పటికీ, నష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి.

# భూమి పూజ వేళ ఎల్జీ ప్రతినిధుల సంస్కారం

మొదటిపేజీ తరువాయి కార్యక్రమానికి హాజరయ్యారు. దీనిని గమనించిన మంత్రి నారా లోకేశ్, భారతీయ పూజా కార్యక్రమాలలో పాదరక్షలు ధరించరాదనే సంప్రదాయాన్ని వారికి సున్నితంగా వివరించారు. పూజలో పాల్గొనేటప్పుడు పాదరక్షలు తీసివేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేశ్ సూచనను ఎల్జీ ప్రతినిధులు తక్షణమే గౌరవించారు. వారంతా తమ పాదరక్షలను విడిచిపెట్టి, నేలపై కూర్చుని శ్రద్ధాసక్తులతో భూమి పూజలో పాల్గొన్నారు. కొబ్బరికాయలు కొట్టి, ఇతర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. విదేశీయులు భారతీయ సంప్రదాయాలను అర్థం చేసుకుని, వాటిని పాటించడం అక్కడున్నవారిని ఆకట్టుకుంది. మంత్రి లోకేశ్ చొరవ, కొరియన్ ప్రతినిధుల సంస్కారయుత ప్రవర్తన ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను చేకూర్చాయి. కాగా, సుమారు రూ.5000 కోట్ల భారీ పెట్టుబడితో ఎల్జీ ఎలక్ట్రానిక్స్, శ్రీ సిటీలో తమ ఉత్పాదక కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 2000 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభమయ్యాక, దేశీయ మార్కెట్‌లోని 70 శాతం ఎయిర్ కండిషనర్ల (ఏసీ) అవసరాలను ఇక్కడి నుంచే తీర్చాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

# కీలక నిర్ణయాలు తీసుకున్న ఏపీ కేబినెట్

మొదటిపేజీ తరువాయి పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఆపరేషన్ నిర్వహించిన త్రివిధ దళాలను అభినందిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అదేవిధంగా, అమరావతిలో పునర్నిర్మాణ పనులను ప్రారంభించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేబినెట్ ధన్యవాదాలు తెలియజేసింది. 47వ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతి పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులు చేసేందుకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. ప్రధానంగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరును చేర్చే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఏపీ రాజధాని అమరావతి అని స్పష్టం చేస్తూ కేబినెట్ తీర్మానించింది. ఈ తీర్మానం కాపీని కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది. సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాల అమలుపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. తీరప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై కూడా మంత్రులు చర్చించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏపీ పర్యటన సందర్భంగా ప్రధాన వేదికపై సీటింగ్ ఏర్పాట్ల అంశం కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేసినట్లు సమాచారం. కేంద్ర మంత్రులను ఒకవైపు, రాష్ట్ర మంత్రులను మరోవైపు కూర్చోబెట్టేలా ప్రోటోకాల్ జాగ్రత్తలు తీసుకోవాలని



ఆయన అధికారులకు సూచించారు. తన పక్కన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆసీనులయ్యేలా ఏర్పాట్లు చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

# లిక్కర్ స్కాంలో కొత్త మలుపు.. రంగంలోకి ఈడీ

మొదటిపేజీ తరువాయి సంబంధించి సిట్ ఇప్పటికే ఎంతో సమాచారాన్ని సేకరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు ఆయన పీఏ పైలా దిలీప్‌ను అరెస్ట్ చేసింది. వారిని కస్టడీలోకి తీసుకుని లిక్కర్ స్కాంకు సంబంధించి కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. అలాగే ఈ కేసులో మరికొన్ని అరెస్ట్‌లు కూడా జరిగాయి. ఈ కేసుకు సంబంధించి పలువురికి నోటీసులు ఇచ్చిన సిట్ అధికారులు వారిని విచారించారు కూడా. లిక్కర్ స్కాం కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీ తమకు మధ్యంతర రక్షణ కల్పించాలని ఏపీ హైకోర్టు, సుప్రీం కోర్టులను కోరినప్పటికీ వారికి నిరాశే ఎదురైంది.




## పాకిస్థాన్‌కు రేవంత్ రెడ్డి వార్నింగ్

మొదటిపేజీ తరువాయి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణలో అందరం ఒక్కటేనని చాటుతూ తెలంగాణ గడ్డ నుంచి భారత జవాన్లకు స్ఫూర్తి నిచ్చేందుకే ఈ సంఘీభావ ర్యాలీ చేపట్టినట్లు ఆయన వివరించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని ఎవరైనా దెబ్బతీయాలని చూస్తే వారికి నూకలు చెల్లినట్లేనని.. ఇది మా హెచ్చరిక అంటూ సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతామని ఆయన తెలిపారు. మేం శాంతి కాముకులమని ఆయన పేర్కొన్నారు. అది మా చేతగానితనం అనుకుని మా ఆడబిడ్డల నుదిటి సిందూరం తుడిచేయాలనుకుంటే.. వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా సమాధానం చెబుతామన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

# ఎవరినీ వదలం

చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో పాటు ఆయా జిల్లాల ముఖ్య నేతలతో జగన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... కేవలం వైసీపీని ప్రేమించినందుకు, అభిమానించినందుకు కార్యకర్తలు అనేక బాధలు పడుతున్నారని, వారి ఆవేదనను తాను చూస్తున్నానని అన్నారు. “మీ బాధలు చూస్తున్నాను. హామీ ఇస్తున్నాను. ఎవ్వరినీ వదలం. ఎక్కడున్నా సరే, కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి. అధికారంలోకి వచ్చాక వారిని చట్టం ముందు నిలబెడదాం” అని జగన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం చంద్రబాబు, కొందరు పోలీసులు దుర్మార్గాలకు పాల్పడుతున్నారని, వారు ఏదైతే విత్తనం వేస్తున్నారో, రేపు అదే మొలకెత్తుతుందని జగన్ వ్యాఖ్యానించారు.

శుక్రవారం
09 - 05 - 2025


మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



మన గళం,కర్నూలు పాతబస్తీ : నగరంలోని వన్ టౌన్ ప్రాంతంలో ఉన్న చిన్న అమ్మవారి శాలలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి శాలలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి తో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకొని ఉదయం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నమ్మ వారి శాల ఆలయ కమిటీ అధ్యక్షులు జూటూరు గోపాలయ్య, ఉపాధ్యక్షులు విఠల్ శెట్టి, ఆలయ కమిటీ ప్రతినిధులు శేషగిరి శెట్టి, రవి, జవహర్ బాబు, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు వెయ్యి సంవత్సరాల క్రితమే ఆర్యవైశ్య సామాజిక వర్గం కోసం జన్మించి ఆర్యవైశ్యులకు దిశా దశ నిర్దేశం చేశారని చెప్పారు. అలాంటి తమకుల దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ప్రతి సంవత్సరం ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్నామని వివరించారు .ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేశారని చెప్పారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు శాంతి సౌభాగ్యాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు.

## హాస్పిటల్ అప్లికేషన్ ట్రైనింగ్





మన గళం,కర్నూలు వైద్యం : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హాస్పిటల్ అప్లికేషన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.శ్రీరాములు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రస్తుతము ఉన్న ఈ-హాస్పిటల్అ ప్లికేషన్ ను నెక్స్ట్‌జెన్ ఈ-హాస్పిటల్ అప్లికేషన్ గా ప్రభుత్వము అందు బాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఇది రోగి రిజిస్ట్రేషన్, అడ్మిషన్, మరియు క్లినికల్ డేటా రికార్డింగ్‌తో సహా ఆసుపత్రి కార్యకలాపాల యొక్క వివిధ అంశాలను నిర్వహణను కూడా సులభతరం చేస్తుందన్నారు. అందులో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ లకు, పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు సి ఎం ఓ లకు శిక్షణ ఇవ్వడమైనది. ఈ కార్యక్రమానికి సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి వి రావు, , అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్, శివబాల నాగాంజన్, డాక్టర్ ఎం వి కిరణ్‌కుమార్ శిక్షణలో,తదితరులు పాల్గొన్నారు.

# సెలవులు...రద్దు

మన గళం,కర్నూలు వైద్యం : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆసుపత్రి వైద్యులు మరియు వైద్య సిబ్బంది సెలవులు రద్దు చేసినట్లు ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్, డా.శ్రీరాములు చెప్పారు. గురువారం సర్వజన వైద్యశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అత్యవసర సమయంలో వైద్య సేవలపరంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వారి ఆదేశాల మేరకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవడానికి అవసరమైన చర్యల కొరకు వైద్యులు మరియు వైద్య సిబ్బందికి అప్రమత్తం చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు మరియు వైద్య సిబ్బంది పై అధికారుల ఆదేశాల మేరకు ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు మరియు వైద్య సిబ్బందికి సెలవులన్నీ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారి చేశారు.

అత్యవసర సమయంలో ఎలా వైద్యాన్ని అందించాలన్న దానిపై ఆసుపత్రుల్లో ఆక్సిజన్, మరియు మందులు, వెంటిలేటర్స్ అందుబాటులో ఉండి వైద్య సేవలకు అందరు సన్నద్ధంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారి చేశారు.

# బయో మైనింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

**- నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు**



మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : గార్గేయపురం డంప్‌యార్డులో ప్రారంభమైన బయో మైనింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు ఆదేశించారు. గురువారం డంప్‌యార్డంలో బయోమైనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో బయో మైనింగ్ ద్వారా చెత్త శుద్ధి చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. డంప్ యార్డులో నిల్వ ఉన్న దాదాపు 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రానున్న మూడు నెలల్లోపు బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా శుద్ధీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ట్రామెల్ యంత్రాన్ని వినియోగించుకొని చెత్తను నాలుగు పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేస్తారని, ప్లాస్టిక్, ఇనుము, గాజు వస్తువులు, రాళ్లురప్పలను వేర్వేరు చేయడం జరుగుతుందన్నారు. కాగా అంతకన్నా ముందు కమిషనర్ 'సెట్కూర్ కార్యాలయం' వద్దనున్న "అన్న క్యాంటీన్"ను పరిశీలించారు. మెనూ, టోకెన్ల సంఖ్య, శుభ్రత అంశాలపై ఆరా తీశారు. నిర్వహణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకోరావాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. అలాగే కొత్త బస్టాండ్, గుత్తి పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, డిఈఈ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ఫాన్ జీసస్ (అభయగిరి ) చిల్డ్రన్స్ హోమ్ ను తనిఖీ చేసిన న్యాయమూర్తి



మన గళం,కర్నూలు లీగల్ : జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్ధి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం కర్నూలు మిలటరీ కాలనీలోని ఇన్ఫాన్ జీసస్ చిల్డ్రన్ హోమ్ ను తనిఖీ చేశారు. ఆశ్రమంలోని నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమంలోని రికార్డులును, అలాగే పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే వారికీ అందుతున్న ఆహార, వైద్య సదుపాయల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికీ ఏమైనా సమస్యలు వస్తే 15100టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామన్నారు.

## వివాహ కార్యక్రమాలకు హాజరైన నేత కాటసాని



మన గళం,కర్నూలు సిటి : వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి కర్నూలు,నంద్యాల జిల్లాల్లో జరిగిన పలు వివాహ కార్యక్రమాలకు హాజరయ్యారు. గురువారం ఆయన ఆ,యా కార్యక్రమాలకు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి 4642వ జయంతోత్సవాలు



మన గళం,గుడివాడ : బుధవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాన్ని గుడివాడ పట్టణంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం వేలాదిమందికి అన్న వితరణ నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించిన శోభాయాత్రలో రాష్ట్ర మంత్రులు, కూడా చైర్మన్, శాసనసభ్యులు పురవీధులలో అందర్నీ ఆకర్షించే విధంగా పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గుడివాడ పట్టణంలో అమ్మవారి శోభయాత్ర ఈ సంవత్సరం జరిగిందని , ఇది గోకవరపు సునీల్ కుమార్ నాయకత్వం కావడంతోనే ఇంత ఘనంగా జరిగిందని వారి పిలుపుతో పట్టణ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఈ యాత్రలో పాల్గొన్నారని పలువురు ప్రశంసించారు. సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రలో సన్నాయి మేళాలు శక్తి వేషములు హరే రామ హరే కృష్ణ బృందముచే బృందగానం తీన్మార్ డబ్బులు,ఎల్ఈడి వాల్స్ ద్వారా అమ్మవారి చరితాన్ని పుర ప్రజలకు తెలిసే విధంగా డిస్ప్లే చేయడం ముఖ్యంగా ఆకర్షించాయి. బాణాసంచా ప్రత్యేకతను సంతరించుకున్నది. మహిళలు పురుషులు తమ వ్యాపారాలను పనులను త్వరగా ముగించుకొని అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. శోభయాత్రలో రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టి జి భరత్, గుడివాడ శాసనసభ్యుడు వెనిగండ్ల రాము, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు నందిగామ నుండి రాము కైకలూరు నుండి మాల్యాద్రి కావలి నుండి వాసు, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిరివీధి వెంకట సుబ్బారావు నందివాడ మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ తాడిపత్రి సురేష్ పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని పట్టణ వైశ్య సంఘం అధ్యక్షులు జవ్వాజి గంగరాజు మరియు పాలకవర్గం కార్యవర్గం పాల్గొన్నారు.

## కోల్ ఇండియాకు రూ.9,593 కోట్ల లాభాలు

మన గళం :దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు కోల్ ఇండియా 2024-25 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 12 శాతం వృద్ధితో రూ.9,593 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.8,530 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 2024-25కు గాను తుది డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.5.15 చెల్లించడానికి కోల్ ఇండియా బోర్డు నిర్ణయించింది. ఎజిఎం తర్వాత ఈ మొత్తాన్ని 30 రోజుల్లో చెల్లించనుంది. గడిచిన క్యూ4లో కంపెనీ మొత్తం వ్యయాలు రూ29,057 కోట్లకు పెరిగాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.28,950 కోట్లుగా నమోదయ్యాయి. 2024-25లో మొత్తంగా 781.05 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. ఇంతక్రితం 2023-24లో 773.65 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగింది. బుధవారం ఎన్ఎస్ఇలో కోల్ ఇండియా షేర్ 1.6 శాతం పెరిగి రూ.384 వద్ద ముగిసింది.



# ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

మన గళం,కర్నూలు కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ పొగాకు కంపెనీల పై మధ్య దళారులపై చర్యలు తీసుకొని రైతుల దగ్గర ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయించి రైతులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పొగాకు రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం చేపట్టారు అనంతరం డిఆర్ఓ గారికి వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ఏ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న , ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు తాంద్రపాడు సర్పంచ్ బాలపీరా, రైతు సంఘం మండల నాయకులు మధు ,రైతు సంఘం నాయకులు గొందిపర్ల మాజీ సర్పంచ్ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు జి ఆంజనేయులు, పంచలింగాల గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు రైతు సంఘం ఓర్వకల్లు మండల కార్యదర్శి చంద్రబాబు నాయుడు రైతు సంఘం ఓర్వకలు మండల నాయకులు మధుసూదన్, తాంద్రపాడు రైతు నాయకులు వీరేష్ ఉల్చాల నాయకులు మద్దిలేటి పాల్గొన్నారు. అంతకుముందు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేయడం కోసం కలెక్టర్ కార్యాలయానికి చేరుకోగానే త్రీటౌన్ సీఐ మరియు వారి సిబ్బంది అతి ఉత్సాహంతో రైతులు తెచ్చుకున్న పొగాకు బెయిల్ మరియు బ్యానర్ దౌర్జన్యంగా తీసుకపోతుండగా అడ్డుపోయిన రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ ఓర్వకల్లు మండల నాయకులు మధుసూదన్ , మరియు రైతు సంఘం కార్యకర్తలనును, రైతులను సిఐ మరియు వారి సిబ్బంది బల వంతంగా తోసివేసి మధుసూదన్ ను త్రీ టౌన్ స్టేషన్ కు తీసుకపోవడం జరిగింది ఆగ్రహం దీంతో ఆగ్రహం చెందిన రైతు సంఘము నాయకులు, కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయంలోకి చొరబడే ప్రయత్నం చేశారు పోలీసులు నివారించినప్పటికీ వెళ్లే ప్రయత్నం చేశారు పోలీసులు తీసుకుపోయిన బ్యానరు పొగాకు వెనక్కు తెచ్చి ఇవ్వాలని, రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్ ను వదిలి పెట్టాలని డిమాండ్ చేస్తూ మెయిన్ గేట్ దాటి బయటాయించడం జరిగినది. జిల్లాలో వేసిన పొగాకు పంటను పూర్తిగా కొనుగోయాలని కంపెనీలు మధ్యద లా రుల మోసాలను అరికట్టాలని, పోలీసుల దౌర్జన్యం నశించాలని, పొగాకు పంటను పూర్తిగా కొనుగొలుచేసే వరకు పోరాడుతామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు వెంటనే 3 టౌన్ సిఐ స్పందించి తీసుకు వెళ్లిన బ్యానరు ధర్నా దగ్గరికి తీసుకువచ్చి ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ మాట్లాడుతూ రైతులను మోసం చేసి పొగాకు కొనకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకొని రైతుల పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు సామరస్యంగా నిరసన చేసి తమ గో డును విన్నవించుకోవాలని వచ్చిన రైతులు రైతు సంఘం కార్యకర్తలను ఈ విధంగా దౌర్జన్యంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు అయిన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు గత సంవత్సరం రైతుల వద్దకు వెళ్లి ఐ టి సి ,జిపిఐ, వి ఎస్ టి వివిధ కంపెనీల ఏజెంట్లు వారి సిబ్బంది పొగాకు పంటను వెయ్యాలని 15 వేల నుండి 18 వేల వరకు గిట్టుబాటు ధర ఇస్తామని నమ్మబలికి రైతులకు పర్మిషన్ ఐడి ఇచ్చి ఈరోజు రైతులు పండించిన పొగాకును కొనకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు దీనివల్ల కంపెనీ యాజమాన్యం మధ్య దళారులు రైతులను మోసం చేసి అసలైన పొగాకు 11 ,12000 వేలు మాత్రమే రేటు వేస్తున్నారని మరి కొంతమంది రైతులకు 6 నుండి 7 ,8 వేల రూపాయలు మాత్రమే వేస్తున్నారని యాజమాన్యంకు ఇలాంటి వైఖరి తగదని అన్నారు ఎకరాకు లక్ష 50 వేలు ఖర్చుపెట్టి పొగాకు వేసిన రైతులు లబోదిబోమంటుంటే ప్రభుత్వ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు స్పందించి కంపెనీ యాజమాన్యం పై చర్యలు తీసుకొని రైతులు పండించిన పొగాకు పంటను పూర్తిగా కొనేటట్లు చర్యలు తీసుకోవాలని కంపెనీలు మధ్య దళారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పొగాకు రైతులను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతులు శేఖర్, జమ్మన్న, బషీర్ ,మల్లేష్, రాంబాబు, మురళి రామచంద్రుడు, చాంద్ బాషా, వీరేశ్ పొగాకు రైతులు తదితరులు పాల్గొన్నారు . మధుసూదన్ ను సీఐ వెంటనే వదిలివేశారు.

# గవర్నర్ అవార్డు, గోల్డ్ మెడల్ ను పొందిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మన గళం,నంద్యాల కలెక్టరేట్ : రెడ్ క్రాస్ అభివృద్ధికి విశేష సేవలు అందించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గవర్నర్ అవార్డును పొందారు. గురువారం అమరావతిలోని రాజ్ భవన్ లో జరిగిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం మరియు ప్రపంచ తలసేమియా దినోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎస్. అబ్దుల్ నజీర్ మరియు ప్రథమ మహిళ శ్రీమతి సమీరా నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గవర్నర్ అవార్డు, గోల్డ్ మెడల్ ను స్వీకరించారు. రాష్ట్రంలో రెడ్ క్రాస్ ఉద్యమానికి అత్యుత్తమ సేవలు అందించడంతోపాటు మరియు గరిష్ట సహకారాన్ని సమీకరించినందుకు 8 మంది కలెక్టర్లకు గవర్నర్ పతకాలను అందజేశారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో రెడ్ క్రాస్ అభివృద్ధికి విశేష సేవలు అందించిన నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గారికి ప్రతిష్టాత్మకమైన అవార్డును మరియు గోల్డ్ మెడల్ ను గవర్నర్ గారి చేతులు మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఇటీవల అధునాతన వసతులతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను ప్రారంభించుకున్నామన్నారు. అలాగే రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రజలకు అత్యంత తక్కువ ధరలకు లభ్యమయ్యేలా జనరిక్ మెడికల్ షాప్ ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యూత్ బ్లడ్ క్రాస్ ను బలోపేతం చేసి అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా రెడ్ క్రాస్ ఆర్మీనీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తయారు చేస్తామన్నారు. మత్స్యకారులకు, చెంచు కుటుంబాలకు కూడా రెడ్ క్రాస్ సంస్థ ద్వారా మరిన్ని వైద్య సేవలు ఇంటింటికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వై డి రామారావు, కోశాధికారి రామచంద్ర రాజు, జనరల్ సెక్రెటరీ ఏకే ఫరీదా ఐఏఎస్ , నంద్యాల చైర్మన్ దస్తగిరి పర్ల తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ లో రెడ్ క్రాస్ తలసేమియా బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ సెంటర్ ను గవర్నర్ రాజ్ భవన్ నుండి వర్చువల్ మోడ్ లో ప్రారంభించారు.

# మే 20 వ తేదీన జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని రైస్ మిల్లు కార్మికులకు పిలుపు

మన గళం,కర్నూలు బళ్లారి చౌరస్తా : రైస్ మిల్లు కార్మికుల విస్తృత సమావేశం ఎర్రమల అధ్యక్షతన జరిగింది సమావేశానికి హాజరైన కర్నూలు నగర ఆయిల్ మరియూ రైస్ మిల్లు కార్మికుల యూనియన్ అధ్యక్షుడు డీ గౌస్ దేశాయ్ కార్యదర్శి సి హెచ్ సాయిబాబా లు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చింది. వీటిని రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఈయస్ఐ పియఫ్ సౌకర్యాలు కల్పించాలని,ప్రమాద బీమా సౌకర్యం కల్పించి సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు, దేశవ్యాప్తంగా సరలీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన 22 సమ్మెలకు ఈ సమ్మెకు చాలా వ్యత్యాసం ఉంది ఇతర 16 డిమాండ్ల కన్నా అన్నింటిలోనూ లేబర్ కోడ్ల ను అడ్డు కోవడం ప్రధాన అంశం లేబర్ కోడ్స్ అమలు లోకి వేస్తే చట్టాలు వర్తించే కార్మికులు, చట్టాలు వర్తించని కార్మికులు అందరూ బానిసత్వం లోకి నెట్టవేయబడతారు అని, లేబర్ కోడ్ల వేస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుంది, ఇవే కాకుండా కార్మికులు అనేక హక్కులు కోల్పోవాల్సి వస్తుందని, అందుకే కార్మికులు అందరూ ఒక్కతాటిపైకి వచ్చి మే 20 వ తేదీన జరిగే సమ్మె లో కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపు ఇవ్వడం జరిగింది.సమావేశం లో కార్మికులు,గాలెన్న, హనుమంతు, శేఖర్, శివున్ని మద్దిలేటి, ముందు శేఖర్, వెంకటేశ్వర్లు శేషన్న ఓంకారం కార్మికులు పాల్గొన్నారు.



# మే 20 దేశవ్యాప్త సమ్మెకు ఫీల్డ్ అసిస్టెంట్లు సమ్మె నోటీసు అందజేత




మన గళం, మే 20వ తేదీన జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సమ్మెలో పాల్గొనేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధమయ్యారు. అందుకు సంబంధించిన సమ్మె నోటీసును డ్వామా పి.డి.కి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఇండస్టెంట్లు కూడా పాల్గొంటున్నట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు చాలా తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. రాజకీయ వేధింపులు పెరిగిపోయాయని తెలియజేశా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరారు ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు ఫీల్డ్ అసిస్టెంట్లకు నష్టపరిహారం కింద పది లక్షల రూపాయలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు మహమ్మద్ రఫీ ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు మహబూబ్ బాషా పవన్ కళ్యాణ్ తాయప్ప లక్ష్మీనారాయణ దస్తగిరి,తదితరులు పాల్గొన్నారు.

# మే 13 వ తేదీ నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు

**– రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక**

మనగళం, నంద్యాల :ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల కు శ్రీ రామకృష్ణ విద్యాలయ ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్లో జిల్లా స్థాయి 11 సంవత్సరముల లోపు బాల బాలికలకు వేరు వేరు విభాగాలలో చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్.రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి,ఎస్వీ డిగ్రీ కళాశాల,సి.ఎం.ఎస్.జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ముని శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్ సైట్ లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని,నంద్యాల జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25వ తేదీల్లో గుంటూరులో జరగబోవు రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 9010451585 నంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

కీలుబొమ్మలుగా దర్యాప్తు సంస్థలు

విధి నిర్వహణలో దర్యాప్తు సంస్థల పాత్ర తరచూ వివాదాస్పదమవుతోంది. బాధ్యతాయుతంగా దర్యాప్తు చేపట్టి, నేరాలకు ముకుతాడు వేయడంలో కీలకపాత్ర పోషించవలసిన దర్యాప్తు సంస్థలు అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాస్తున్నాయని, పాలకుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నాయని తరచూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విపక్ష పార్టీలు ఈ రకమైన ఆరోపణలు చేయడాన్ని అర్థం చేసుకోవచ్చు కానీ, ప్రజాస్వామికవాదులు, న్యాయస్థానాలు సైతం దర్యాప్తు సంస్థల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేయడం గమనించవలసిన విషయం. ఒకప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)పై మాత్రమే ఆరోపణలు ఉండేవి. కానీ, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ (ఐటి) వంటి సంస్థలకు కూడా ఈ మకిలి అంటింది. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపునకు ఈ రెండూ కేంద్రం చేతిలో పావులుగా మారాయంటూ విమర్శలు రావడం పరిపాటిగా మారింది. తాజాగా చత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కేసు విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వ్యవహార శైలిపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. 'మూడు చార్జిషీట్లు దాఖలయ్యాయి. మీరు నిందితుడిని కస్టడీలో ఉంచి శిక్షిస్తున్నారు. విచారణ ప్రక్రియనే శిక్షగా మార్చారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన ఆధారాలు సేకరించకుండా కొందరు వ్యక్తులపై అభియోగాలు మోపుతున్న తీరును విమర్శిస్తూ, ఎప్పుడూ ఇదే తీరంటూ ఈసడించింది. ఆమాటకొస్తే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను న్యాయస్థానాలు తప్పుపట్టడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది ఆగస్టులోనూ ఓ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇడిని తీవ్రస్థాయిలో మందలించింది. 'ఏ వ్యక్తి స్వేచ్ఛనూ హరించకూడదు. వ్యక్తి స్వేచ్ఛ అనేది ఒక నియమమే. దాన్ని కోల్పోవడమనేది మినహాయింపుగానే ఉండాలి. ఆ స్వేచ్ఛపై నియంత్రణ విధిస్తే అది చట్టబద్ధంగానే జరగాలి. బెయిలివ్వడానికి మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం రెండు షరతులు ఉన్నాయి. అంతమాత్రాన వ్యక్తి స్వేచ్ఛను హరించడమే ప్రమాణమని ఆ నిబంధన ఎక్కడా చెప్పలేదు' అని చీవాట్లు పెట్టింది. వ్యక్తులను అరెస్టు చేయడానికి, రోజుల తరబడి కస్టడీలో ఉంచడానికి మనీలాండరింగ్ చట్టం ఇడికి ఒక ఆయుధంగా మారిందనేది సర్వత్రా వినిపిస్తున్న విమర్శ. నిందితులను జైలుకు పరిమితం చేసేందుకు ఈ చట్టం ఉపయోగపడుతోందన్నది పలువురి అభియోగం. ఈ చట్టం కింద నమోదైన కేసులు ఎక్కువ కాలం పెండింగులో ఉంటున్న మాట వాస్తవమేనంటూ ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరే స్వయంగా అంగీకరించడం చట్టం అమలులోని లొసుగులను బహిర్గతం చేస్తోంది. మామూలు నేరాల్లో ఎవరిపైనైనా కేసు నమోదు చేస్తే ఎఫ్ఐఆర్ దాఖలు చేసి, దాన్ని సదరు వ్యక్తికి అందజేయడం తప్పనిసరి. ఇడి కేసుల్లో ఇలా ఇసిఐఆర్‌ను విడుదల చేస్తారు. కానీ దాన్ని నిందితులకు తప్పనిసరిగా ఇవ్వాలన్న నిబంధన మనీలాండరింగ్ చట్టంలో లేదు. పైగా ఈ చట్టం కింద ఇడి అధికారులు ఎవరికైనా సమన్లు పంపి విచారించే అధికారం ఉంటుంది. తాను సాక్షినో, ముద్దాయినో సదరు వ్యక్తికి తెలియదు. ఇలా ఇడి అధికారులకు అపరిమితమైన అధికారాలు కట్టబెట్టిన మనీలాండరింగ్ చట్టంవల్ల నిందితులకు బెయిల్ దొరకడం దుర్లభమవుతోందనే విషయం ఇప్పటికే అనేక కేసులలో రుజువైంది కూడా. ఈ చట్టంపై వెల్లువెత్తుతున్న విమర్శలను, దాఖలవుతున్న పిటిషన్లను గమనించిన సర్వోన్నత న్యాయస్థానం 2022లో ఈ చట్టం కింద ఇడికి తాను స్వయంగా దాఖలు పరచిన అధికారాలను పునస్సమీక్షించేందుకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడం తాజా పరిణామం. ఇరవైరెండేళ్ల క్రితం రూపొందిన ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం (పిఎంఎల్‌ఎ)2005 జూలైనుంచి అమలులోకి వచ్చింది. అయినా తొలినాళ్లలో ఈ చట్టం అంత ప్రభావవంతంగా అమలు కాలేదు. పిఎంఎల్‌ఎ కింద తొలి చార్జిషీటు 2012 లో దాఖలైందంటే దర్యాప్తు సంస్థ పనితీరు ఎంత నత్తనడకగా ఉండేదో అర్థం అవుతుంది. అయితే, 2014లో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డాక, ఇడి దూకుడు పెరిగింది. వరుస కేసుల నమోదుతో ఆర్థిక నేరగాళ్ల గుండెల్లో గుబులు పుట్టించింది. అయితే, ఈ దూకుడు వెనక అప్పటి కేంద్రంలోని పెద్దల హస్తం ఉందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ చట్టంలో లోటుపాట్లను సవరించేందుకు సుప్రీంకోర్టు నడుం బిగించడంతో ఇకపై నిందితులకు ఊరట లభిస్తుందని భావించవచ్చు. మరోవైపు, ఆర్థిక చట్టాల అమలులోనూ, ఆర్థికపరమైన నేరాలను అరికట్టడంలోనూ కీలకపాత్ర వహించే ఇడి ఇకనైనా స్వతంత్రంగా వ్యవహరించవలసిన అవసరం ఉంది. పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిందనే అపప్రథను తొలగించుకోవాలంటే, ముందుగా రాజకీయ నేతల ఉచ్చులోంచి బయటపడాలి. నేతల ఒత్తిళ్ళకు లొంగకుండా పనిచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

# అత్యుత్తమ సేవలకు పురస్కారం

**– రాష్ట్ర గవర్నర్ నుండి రెడ్ క్రాస్ అవార్డ్ అందుకున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



మన గళం,కర్నూలు కలెక్టరేట్ : రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ నుండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కు పురస్కారం లభించింది..2023 –24, 2024–25 సంవత్సరాల్లో బాపట్ల, కర్నూలు జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలందించిన సందర్భంగా గురువారం విజయవాడ రాజ్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో గౌ. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ శ్రీ అబ్దుల్ నజీర్ నుండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రెడ్ క్రాస్ అవార్డ్ అందుకున్నారు..రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా గడచిన రెండేళ్లలో కర్నూలు, బాపట్ల జిల్లా లలో చేపట్టిన సేవలను ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. కర్నూలు, బాపట్ల జిల్లాల్లో రెడ్ క్రాస్ ద్వారా బ్లడ్ డొనేషన్ క్యాంపులు, ఆర్గాన్ డొనేషన్స్, మెడికల్ క్యాంపులు పల్స్ పోలియో, లెప్రసీ, ఎయిడ్స్ అవేర్నెస్ ర్యాలీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించడాన్ని గవర్నర్ ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ను అభినందించారు..

# అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్ ను రూపొందించాలి

**– జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య**

మన గళం,కర్నూలు కలెక్టరేట్ : అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్ ను రూపొందించాలని జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు.. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర ఏ 2047 లో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల విజన్ కార్యాచరణ ప్రణాళిక మరియు నియోజకవర్గాల వారిగా విజన్ కార్యాచరణ ప్రణాళికలపై వర్క్‌షాప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ 2047 లో భాగంగా స్టేక్ హోల్డర్ లతో జిల్లా నుండి మండల స్థాయి వరకు సమావేశాలు నిర్వహించి మండల స్థాయిలో ఇన్పుట్ లు తీసుకొని , ఇంటి ఇంటి సర్వే చేసి జిల్లాకి సంబంధించిన 2047 డాక్యుమెంటేషన్ సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు... అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు స్టేట్ విజన్ డాక్యుమెంట్ ను కూడా లాంచ్ చేయడం జరిగిందన్నారు... కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ ప్లాన్ కి అనుసంధానంగా రాష్ట్ర స్థాయిలో స్వర్ణాంధ్ర ఏ 2047 డాక్యుమెంటేషన్ ను తయారు చేసుకోవడం జరిగిందన్నారు.. విజన్ ప్లాన్ ఉంటేనే అనుకున్న గమ్యాన్ని నిర్దేశించిన సమయానికి పూర్తి చేసేందుకు వీలవుతుందన్నారు.. సంవత్సరానికి 50 శాతం వృద్ధి సాధించే విధంగా ప్రైమరీ, సెకండరీ, టెర్రిటరీ సెక్టర్ లలో సామర్థ్యాన్ని అంచనా వేసుకొని మన జిల్లాలో ఉన్న రిసోర్స్ లను అంచనా వేసుకుని వేరు వేరు సెక్టార్ ల నుండి వచ్చే కాంట్రిబ్యూషన్ ని పెంచే విధంగా యాక్షన్ ప్లాన్ చేసుకున్నామన్నారు. జిల్లా యాక్షన్ ప్లాన్ కి అనుసంధానంగా నియోజకవర్గ మండల స్థాయిలో కూడా మైక్రో లెవెల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు.. విజన్ ఆంధ్రలో ఉండే పది సూత్రాలు జీరో పవర్టీ, అగ్రికల్చర్ సెక్టార్, వాటర్ సెక్యూరిటీ, స్కిల్ డెవలప్మెంట్, సోషల్ సెక్యూరిటీ ఆ విధంగా%అ%అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్ ను రూపొందించాలన్నారు... సామాజిక భద్రతా పెన్షన్ల విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామన్నారు..ప్లానింగ్ డిపార్ట్మెంట్ అడ్వైజర్ సీతాపతి రావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ2047 లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళిక ఏ విధంగా రూపొందించుకోవాలనే విషయంపై ఈరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు... నియోజకవర్గ స్థాయిలో రూపొందించే ప్రణాళికకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రతి జిల్లాలో ఉండే నియోజకవర్గ వారిగా వారు రూపొందించిన ప్రణాళికను ముఖ్యమంత్రి వర్యులు స్వయంగా చూస్తారన్నారు.. నియోజకవర్గ ప్రణాళికను చాలా జాగ్రత్తగా రూపొందించాలని తెలిపారు.. యాక్షన్ ప్లాన్ ఏ విధంగా తయారు చేయాలనే విషయాన్ని పిపిటి ద్వారా హాజరైన సిబ్బందికి వివరించారు..కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, కర్నూల్ ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్, నంద్యాల సిపిఓ వేణుగోపాల్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# సున్నిపెంటలో షార్ట్ సర్క్యూట్ తో తగలబడిన కారు



మనగలం: నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట నీటిపారుదల శాఖ అతిథి గృహం వద్ద షార్ట్ సర్క్యూట్ తో తగలబడిన కారు సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా కారు బానెట్లో పొగలు రావడం అంతలోనే మంటలు ఒక్కసారిగా చెలరేగడంతో ఉలిక్కిపడ్డ ఆర్ ఐ రాజేష్ ఫైర్ ఇంజన్ కు సమాచారం ఇచ్చినప్పటికీ సరైన సమయంలో రాకపోవడంతో కారు పూర్తిగా తగలబడింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (%న్రాఖీ%) ఆర్ ఐ రాజేష్ వివరణ మేరకు షార్ట్ సర్క్యూట్ తోనే కారు తగలబడినట్లు తెలిపారు. కళ్ళముందే కారు మంటల్లో కాలిపోతున్నప్పటికీ సరియైన సమయానికి ఫైర్ ఇంజన్ రాకపోవడంతో పూర్తిగా తగలబడిందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రధానంగా 20 వేలమంది ప్రజలను నివసిస్తున్న సుండిపెంట గ్రామంలో అగ్నిమాపక కేంద్రం సుండిపెంటలో లేకపోవడం పలు విమర్శలను ఎదుర్కొంటున్న సుండిపెంటల అగ్నిమాపక కేంద్రం శ్రీశైలానికి తరలించడం పై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు....





## కుప్పకూలిన అండర్ గ్రౌండ్ టన్నెల్



మన గళం,కర్నూలు రూరల్ : కర్నూలు నగరంలో సూరత్ – చెన్నై నేషనల్ హైవే పనులు జరుగుతుండగా కర్నూలు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద అకస్మాత్తుగా అండర్ గ్రౌండ్ టన్నెల్ కుప్పకూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవ్వరు లేకపోవడంతో ఎటువంటి ప్రాణహాని జరగలేదు. ఈ నేపథ్యంలో ఔటర్ రింగ్ రోడ్డు హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్న.విషయం తెలుసుకున్న వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి గురువారం ఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి ,త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

# పెల్లుబికిన..ఆనందం

**– వీర జవాన్ల చిత్రపటాలకు...పాలాభిషేకం**

**– టెంకాయలు కొట్టి,జై కొట్టిన..వైకాపా నేతలు**




(మన గళం,కర్నూలు రాజవిహార్) : అభిమానం..పెల్లుబికింది. పెహల్గావ్ ఘటనకు ప్రతిగా ఆపరేషన్ సింధూర్ ను విజయవంతం చేసిన భారత సైన్యం ఘన చరితను శ్లాఘిస్తూ –వైకాపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వీర జవాన్ల నిలువెత్తు చిత్రపటాలకు పలువురు వైకాపా నేతలు,కార్యకర్తలు పాలాభిషేకం చేసి, టెంకాయలు కొట్టి, జయ,జయధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా నేత ఎస్.వి.మోహన్ రెడ్డి మాట్లాడుతూ కేవలం నిముషాల వ్యవధిలోనే ఆపరేషన్ సింధూర్ ను పూర్తి చేసి, భారత సైనికులు తమ సత్తా చాటారని హర్షం వ్యక్తం చేశారు. ఆ వీర జవాన్లకు భారతదేశం యావత్తూ ఎన్నటికీ రుణపడి ఉంటుందన్నారు. పాకిస్తాన్ ఇప్పటికైనా కళ్లు తెరుచుకుని, భారత దేశ సైన్యం సత్తాను గ్రహించి, ఉగ్ర దాడులను ప్రోత్సహించడం మానుకోవాలని, లేని పక్షంలో తగిన గుణపాఠం భారతదేశం చెబుతుందని హెచ్చరించారు. ఒకవేళ యుద్ధమే వస్తే దేశంలోని 140 కోట్ల ప్రజలందరూ యుద్ధానికి సిద్ధమై, సైనికుల్లా పోరాడేందుకు సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వందేమాతరం, జై భారత్, జై జవాన్, హిందుస్తాన్ జిందాబాద్..పాకిస్థాన్..ముర్దాబాద్ అంటూ..పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, విక్రమసింహా రెడ్డి, నాయకులు సుభాష్ చంద్రబోస్, గడ్డం రామక్రిష్ణ,షరీఫ్,కిషన్,బాబు,తదితరులు పాల్గొన్నారు.

## నేరగాళ్ల ఎత్తుగడలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్ట

**– జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**






మనగళం, నంద్యాల :నేరస్తుల ఎత్తుగడలను సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అడ్డుకట్ట వేయొచ్చని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. గురువారం రాష్ట్ర డిజిపి ఆదేశాలమేరకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై శిక్షణ కార్యక్రమం నంద్యాల ఎస్పి అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో నంద్యాల పట్టణ కేంద్రంలోని రామకృష్ణ పీజీ కళాశాల నందుగల ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుండి పోలీస్ అధికారులు స్టేషన్ రైటర్లు ఈ శిక్షణా తరగతులలో పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుండి తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్షాధారాల సేకరణ, వాటి భద్రత ప్రమాణాలు ఎలా పాటించాలి అనే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తెలియజేశారు. కేసుల దర్యాప్తు విషయంలో తప్పుదోవ పట్టించేందుకు నేరస్తులు సాంకేతికంగా కొత్త పద్ధతులను ఉపయోగిస్తున్న సందర్భంలో వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఈ శిక్షణా తరగతులు అందిపుచ్చుకోవాలని కొత్త విషయాలను నేర్చుకోవాలని తెలియజేశారు. ఫోరెన్సిక్ సైన్స్ నందుగల అన్ని విభాగాలకు సంబంధించిన నిష్ణాతులైన వారితో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది కావున ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముఖ్యంగా నేర పరిశోధన సమయంలో ఆమోదయోగ్యమైన సాక్ష్యం మరియు నేర ప్రక్రియ యొక్క చట్టపరమైన ప్రమాణాల పాటించాలన్నారు.

డీఎన్ఏ విశ్లేషణ , వేలిముద్రలు , రక్తపు మరకల నమూనాలు , తుపాకీలు , బాలిస్టిక్స్ , టాక్సికాలజీ , మైక్రోస్కోపీ, అగ్ని శిథిలాల విశ్లేషణ వంటి వాటిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాక్షాదారాలు సేకరించాలని వాటిని భద్రపరిచి నేరం చేసిన వ్యక్తికి శిక్షపడేలా ఈ శిక్షణా తరగతుల ద్వారా మంచి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావళి, ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్, ఫోరెన్సిక్ సైన్స్ అసిస్టెంట్ లు డాక్టర్ ఎస్. అసిం భాష, డాక్టర్ ఎం. కృష్ణ కుమార్ రెడ్డి, జి శ్యాంప్రసాద్, కుమారస్వామి రెడ్డి లు పాల్గొన్నారు.

## డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబియా పర్వీన్ ను కలిసిన ఏపీ హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్



మన గళం,కర్నూలు కలెక్టరేట్ : డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబియా పర్వీన్ ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ నూతన సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన సూరి మన్సూర్ అలీ ఖాన్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిఎండబ్ల్యూ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ కి శుభాకాంక్షలు తెలియజేసి, సన్మానించారు. పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే హజ్ యాత్రికులకు సేవ చేసే అవకాశం లభించడం ఓ అరుదైన అవకాశమని, ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం మైనార్టీ అంశాలపై చర్చించారు.

# పసిడి ప్రియులకు షాక్..



మనగళం, : బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ హైకి ఎగబాకి.. లక్ష మార్కు దాటిన విషయం తెలిసిందే.. ఆ తర్వాత పసిడి ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చినట్లే వచ్చి.. మళ్లీ ఎగబాకుతున్నాయి. బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ హైకి ఎగబాకి.. లక్ష మార్కు దాటిన విషయం తెలిసిందే.. ఆ తర్వాత పసిడి ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చినట్లే వచ్చి.. మళ్లీ ఎగబాకుతున్నాయి.. వాస్తవానికి అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం.. బంగారం, వెండి ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి. ఒక్కోసారి ధరలు తగ్గితే.. మరికొన్నిసార్లు పెరుగుతుంటాయి. ప్రస్తుతం బులియన్ మార్కెట్‌లో స్వచ్ఛమైన పసిడి ధర 99వేలకు పైగా ఉంది. మే 08 2025 గురువారం ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. ధరలు స్వల్పంగా పెరిగాయి.. దేశీయంగా 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.90,760 గా ఉండగా.. 24 క్యారెట్ల పది గ్రాముల గోల్డ్ ధర రూ.99,010 గా ఉంది. వెండి కిలో ధర రూ.99,100లుగా ఉంది. పదిగ్రాముల బంగారంపై రూ.100, కిలో వెండిపై రూ.100 మేర ధర పెరిగింది. కాగా.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.90,910, 24 క్యారెట్ల ధర రూ.99,160 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.98,010 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల రేటు రూ.99,010 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది.

## బెల్లం అన్నంతో బోలెడు లాభాలు..



మన గళం : చాలా మంది స్వీట్స్ తినేందుకు ఇష్టపడుతూ ఉంటారు. ఇలా తినడం అస్సలు మంచిది కాదు..కానీ, స్వీట్ అంటే ఇష్టపడేవారు క్రమం తప్పకుండా బెల్లం అన్నం తింటే అద్భుతమైన ప్రయోజనాలు పొందుతారని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజు భోజనం చేశాక ఒక చిన్న బెల్లం ముక్కను నోట్లో వేసుకుంటే జీర్ణ సమస్యలతో పాటు..శరీరంలో అనేక రోగాలను దూరం చేస్తుందని చెబుతున్నారు. బెల్లంలో శరీరానికి అవసరమయ్యే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడానికి బెల్లం అద్భుతమేలు చేస్తుంది. బరువు తగ్గడంలో, మలబద్దకాన్ని తగ్గించడంలో బెల్లం ఎంతగానో ఉపయోగపడుతుంది. బెల్లం తరచూ తీసుకోవడం వల్ల శరీరంలో ఉండే వ్యర్థాలను బయటకు తోసేస్తుంది. బెల్లాన్ని ఉపయోగించి చేసే తీపి వంటకాలలో బెల్లం అన్నం కూడా ఒకటి. బెల్లం అన్నం తింటే శరీరానికి తగిన మోతాదులో శరీరానికి ఐరన్ లభిస్తుంది. ఇందులో కాల్షియంతో పాటు ఇతర పోషకాలు లభిస్తాయి. ఇవి ఎముకల సమస్యల నుంచి విముక్తి కలిగిస్తాయి. అలాగే ఈ బెల్లం అన్నం తింటే హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. బెల్లం అన్నం తింటే అందులో ఉండే పొటాషియం శరీరానికి లభించి.. రక్తపోటును నియంత్రిస్తుంది. ప్రతి రోజూ ఒక చిన్న ముక్క బెల్లం తిన్న కూడా దాని ఫలితం ఉంటుంది. అలసట తగ్గుతుంది. తక్షణ శక్తి లభిస్తుంది. శరీరంలో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కీళ్లనొప్పులు, జాయింట్ పెయినస్‌తో బాధపడుతున్న వారికి బెల్లం, బెల్లం అన్నం తరచూ తీసుకోవటం మంచిది. ఇందులో కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. దీని వల్ల ఎముకలు బలంగా ఆరోగ్యంగా మారతాయి. బెల్లంలోని గుణాలు జాయింట్ పెయిన్స్‌ని దూరం చేస్తుంది. అలాగే ఇందులో బెల్లం అన్నం తినటం వల్ల శరీరానికి అవసరమైన ఫాస్పరస్ శక్తి ఉత్పత్తికి దోహదం చేస్తుంది. అలాగే బెల్లంలో లభించే మాంగనీస్, జింక్, రాగి అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అయితే ఈ బెల్లం అన్నం తినేవారు అతిగా తినకపోవడం చాలా మంచిది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు బెల్లం అన్నం తికపోవడం చాలా మంచిది.

## కీర దోస తిన్నాక వీటిని తిన్నారంటే..



మన గళం : ఏడాది పొడవునా మార్కెట్లో లభించే అద్భుత ఆహారం కీర. వేసవిలో కీరదోస తినడం శరీరానికి చాలా మంచిది. ఇందులో దాదాపు 95% నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. కీరదోస ఏడాది పొడవునా మార్కెట్లో లభించే అద్భుత ఆహారం. వేసవిలో కీరదోస తినడం శరీరానికి చాలా మంచిది. ఇందులో దాదాపు 95% నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. కీరదోస వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దీనిని తప్పుడు మార్గంలో తినడం శరీరానికి లభం కన్నా హానికరం అధికమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కీరదోసలో పొటాషియం, మాంగనీస్, కాల్షియం, భాస్వరం, విటమిన్లు ఎ, బి, సి, కె వంటి పోషకాలు ఉంటాయి. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా దీనిని తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మాన్ని మెరుగుపరుస్తుంది. కీరదోస వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దీనిని తిన్న తర్వాత పాలు తాగడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు వస్తాయి. అలాగే కీరదోస తిన్న తర్వాత నారింజ, నిమ్మకాయలు, ద్రాక్ష వంటి పండ్లు తినడం మంచిది కాదు. దీనివల్ల కడుపులో గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు వస్తాయి. అరటిపండ్లు, కీరదోస రెండూ తినడం వల్ల చలిగా అనిపించవచ్చు. లేదా కీరదోస తిన్న వెంటనే అరటిపండ్లు తినడం మంచిది కాదు. దీనివల్ల జలుబు వచ్చే అవకాశం పెరుగుతుంది. కడుపులో శ్లేష్మం ఏర్పడుతుంది. కీరదోస తిన్న వెంటనే నీరు తాగటం కూడా మంచిదికాదు. ఎందుకంటే కీరదోసలో దాదాపు 95 శాతం నీరు ఉంటుంది. అందువల్ల కీరదోస తిన్న తర్వాత నీరు తాగడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి.

## తల్లి పాలల్లో అద్భుత ఔషధ గుణాలు..

మన గళం :ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ టీవీ, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చూడటం వల్ల కంటి ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోంది. అందువల్ల కంటి నొప్పి, వాపు మొదలైన సమస్యలు పెరుగుతున్నాయి. శరీరంలో టాక్సిన్స్ లేదా చెడు రక్తం అధిక స్థాయిలో ఉన్నప్పుడు కొంతమందికి కళ్ళు చీముతో నిండిపోతాయి. శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. కానీ దాని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంత సులభం కాదు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ టీవీ, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చూడటం వల్ల కంటి ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోంది. అందువల్ల కంటి నొప్పి, వాపు మొదలైన సమస్యలు పెరుగుతున్నాయి. శరీరంలో టాక్సిన్స్ లేదా చెడు రక్తం అధిక స్థాయిలో ఉన్నప్పుడు కొంతమందికి కళ్ళు చీముతో నిండిపోతాయి. దీనివల్ల విపరీతమైన నొప్పి, వాపు వస్తుంది. దీనినే కురు అంటారు. ఈ రకమైన కంటి సంబంధిత సమస్యలను నివారించడానికి రకరకాల ముందులు వాడుతుంటారు. వీటన్నింటికి బదులుగా కంటి సమస్యలను నివారించడానికి తల్లి పాలను ఉపయోగించవచ్చు. ఇది మీలో చాలా మందికి ఆశ్యర్యాన్ని కలిగించవచ్చు. కానీ అది నిజం. ఎక్కువ ఆసుపత్రులు, రవాణా సౌకర్యాలు లేని కాలంలో తలెత్తే ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి మన పూర్వీకులు ఎక్కువగా ఇంటి నివారణలను ఆశ్రయించేవారు. అవి ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా ఆరోగ్య సమస్యకు పరిష్కారాన్ని అందించేవి. కానీ ఇప్పుడు వివిధ రకాల మందులు సులభంగా అందుబాటులో వచ్చాయి. దీంతో ఎవరూ ఈ ఇంటి నివారణలను ఉపయోగించడం లేదు. ముఖ్యంగా తల్లి పాలలో కూడా అనేక ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివి. కానీ ఇది పిల్లలకు మాత్రమే కాకుండా కొన్ని ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి కూడా ఉపయోగపడతాయి. దీని ఔషధ గుణాలు కంటి సమస్యలను తక్షణమే నయం చేసే శక్తిని కలిగి ఉంటాయి. కంటి నొప్పి, దురద, మంట, కన్ను ఎర్రబడటం, కంటి ఇన్ఫెక్షన్లు వంటి వివిధ కంటి సంబంధిత సమస్యలను నివారించడానికి తల్లి పాలను ఉపయోగించవచ్చు. వీటిని కంటిలోకి పోయడం వల్ల ఈ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కంటిలో ఐదు లేదా ఆరు చుక్కలు వేయడం వల్ల కంటి సమస్యలు తొలగిపోతాయి. అయితే ఈ ఇంటి నివారణను ప్రయత్నించే ముందు వైద్యుడిని సంప్రదించడం మాత్రం మర్చిపోకూడదు. ఇలా చేసిన తర్వాత కూడా కంటి నొప్పి లేదా మంట తగ్గకపోతే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## పచ్చి ఉల్లిపాయలు తింటున్నారా..?


మన గళం : పచ్చి ఉల్లిపాయ తింటే నోరు వాసన వస్తుందని చాలామంది తినరు. కానీ, రోజుకో పచ్చి ఉల్లిపాయ తినడం వల్ల ఎన్ని లాభాలో తెలిస్తే అస్సలు విడిచిపెట్టరని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో పచ్చి ఉల్లిపాయ తినటం వల్ల పుష్కలమైన ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. ఎండలు ఎక్కువగా ఉండే ఈ నెలల్లో చల్లగా ఉండి, బాడీలో ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ మెంటెయిన్ చేయడానికి ఉల్లిపాయ ఎంతగానో హెల్ప్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయల్లో నీటిశాతం అధికంగా ఉంటుంది. దీని వల్ల బాడీ హైడ్రేట్‌గా, చల్లగా ఉంటుంది. వీటితోపాటు ఉల్లిపాయలో ఉండే ఎసెన్షియల్ ఎలక్ట్రోలైట్స్ అయిన పొటాషియం ఉంటుంది. ఇది బాడీలో ఫ్లూయిడ్‌ని రెగ్యులేట్ చేస్తుంది. వేసవిలో చెమట వల్ల తగ్గిన ఎలక్ట్రోలైట్స్ కూడా ఉల్లిపాయ తినటం వల్ల బ్యాలెన్స్ అవుతాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఉల్లిపాయల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఉల్లిపాయ తినటం వల్ల చాలాసేపటి వరకూ కడుపు నిండుగా ఉంటుంది. దీంతో త్వరగా ఆకలి వేయదు..ఎక్కువగా తినకుండా ఉంటారు. దీంతో త్వరగా బరువు తగ్గుతారు. పచ్చి ఉల్లిపాయల్లోని గుణాలు గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను దరిచేరకుండా చేస్తాయి. ఉల్లిపాయల్లో శరీరాన్ని చల్లబరిచే గుణాలు ఉన్నాయి. ఇవి బాడీ టెంపరేచర్‌ని తగ్గిస్తాయి. వేడి నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయి. మనం పచ్చి ఉల్లిపాయల్ని లేదా కొద్దిగా కుక్ చేసి తిన్నప్పుడు అవి సల్ఫర్, క్వెర్సెటిన్ వంటి కాంపౌండ్స్‌ని రిలీజ్ చేస్తాయి. ఇవి బాడీలో వేడిని తగ్గిస్తాయి. వేసవిలో కలిగే శరీరంలో వేడి కూడా తగ్గుతుంది. సన్ స్ట్రోక్ ప్రభావం తగ్గుతుంది. సాధారణంగా ఎండాకాలంలో ఎక్కువగా జీర్ణ సమస్యలు వస్తుంటాయి. తిన్నది అరగకపోవడం, ఆకలి తగ్గడం వంటివి ఎక్కువగా ఉంటాయి. అలాంటివారు ఉల్లిపాయ తినటం వల్ల ఫలితం ఉంటుంది. ఇందులోని డైటరీ ఫైబర్, ప్రిబయోటిక్స్, డైజెస్టివ్ ఎంజైమ్స్ అన్నీ కూడా జీర్ణ వ్యవస్థని కాపాడి హెల్దీగా ఉంచుతాయి.





ఫైబర్ రిచ్ ఫుడ్స్ అయిన ఉల్లిపాయలు తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు, మలబద్ధకం, గట్ హెల్త్ సరిగా ఉంటుంది. దీని వల్ల ఎండాకాలంలో వచ్చే ఇన్ఫెక్షన్స్ తగ్గుతాయి. అంతేకాకుండా, వీటిని తినడం వల్ల జుట్టు, చర్మానికి కూడా మంచిదని చెబుతున్నారు నిపుణులు, వేడి పెరగడం వల్ల వచ్చే మొటిమలు, మచ్చలు సమస్యలు రావు. జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. రెగ్యులర్‌గా మనం ఉల్లిపాయల్ని తింటే సమ్మర్ హీట్ నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. పచ్చి ఉల్లిపాయలు శరీరాన్ని కూల్? చేస్తాయి. వేసవిలో శరీర ఉష్ణోగ్రతలను తగ్గిస్తాయి. అయితే, మరీ ఎక్కువగా తినకూడదు, మోతాదు పరిమాణంలోనే తినటం మంచిదని గుర్తు పెట్టుకోవాలి.

# ఈ ఇద్దరిలో టెస్ట్ క్రికెట్‌లో టీమిండియాకు కాబోయే సారథి ఎవరు?





మన గళం :రోహిత్ శర్మ టెస్ట్ కెరీర్ ముగిసింది. బుధవారం టెస్ట్ ఫార్మాట్ నుంచి హిట్‌మన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పుడు భారత జట్టు కెప్టెన్సీ బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనే చర్చ తెరపైకి వచ్చింది. ఇది ఇప్పుడు బీసీసీఐ, సెలక్షన్ కమిటీ ముందున్న అతిపెద్ద సవాల్. అయితే 33 ఏళ్ల వయస్సులో టెస్ట్ క్రికెట్ జట్టు సారథ్య బాధ్యతలు చేపట్టిన రోహిత్.. నాలుగేళ్ల పాటు జట్టును కెప్టెన్‌గా బాధ్యతలు కొనసాగించాడు.

ఇక ఇప్పుడు రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన సారథ్య స్థానాన్ని భర్తీ చేయాల్సిన సమయం వచ్చింది. ఈ ఎంపిక ఇప్పుడు బీసీసీఐకి పెను సవాలుగా మారింది. అయితే రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తే భారత జట్టు తదుపరి కెప్టెన్‌గా జస్ప్రీత్ బుమ్రాకే బాధ్యతలు అప్పగిస్తారని గత కొన్ని రోజులుగా క్రికెట్ అభిమానుల్లో చర్చ నడుస్తుంది. కానీ కొన్ని గాయాల వల్ల బుమ్రా నాలుగు నెలల పాటు ఆటకు దూరమవుతున్నట్టు తెలుస్తోంది.దీంతో ఇప్పట్లో అతనికి కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఇకపోతే భారత జట్టు కెప్టెన్సీ రేసులో మరో ప్లేయర్ పేరు కూడా వినిపిస్తోంది. అతనే యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్. గిల్ కూడా తన అద్భుత ప్రదర్శనతో టీమిండియాలో తనదైన ముద్రవేసుకున్నాడు. జట్టును కీలక సందర్భాల్లో అద్భుత విజయాలను అందించాడు. ఇక ఐపీఎల్‌లో కెప్టెన్‌గా తనకిచ్చిన బాధ్యతలను కూడా చక్కగా నిర్వర్తించాడు. జట్టును అతను నడిపించిన తీరు, జట్టు సభ్యులకు అతనిపై ఉన్న నమ్మకం, అతని కెప్టెన్సీపై గుజరాత్ యాజమాన్య ప్రశంసలు ఇవన్న అతని నాయకత్వ లక్షనాలకు నిదర్శనంగా నిలిచాయి. ఇక బీసీసీఐ కూడా గిల్‌ను భవిష్యత్ కెప్టెన్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు పలు సందర్భాల్లో స్పష్టమైంది. అయితే గిల్ ఎంపికకు ఇక్కడ ఒక చిక్కు వచ్చి పడింది. విదేశాల్లో అతని ఆట తీరు అతనికి కెప్టెన్సీ అవకాశాలను దూరం చేసేట్టు కనిపిస్తోంది. స్వదేశీ గడ్డపై గిల్ నిలకడగా రాణిస్తున్నప్పటికీ.. విదేశాల్లో మాత్రం అతని ఆట తీరు ఆందోళకన కరంగా ఉంటుంది. భారత్ తరపున ఇప్పటి వరకు 32 టెస్టులు ఆడిన గిల్ 1893 పరుగులు చేశాడు. 35 సగటుతో 5 సెంచరీలు చేసిన గిల్ జట్టులో తన స్థానాన్ని ఫిక్స్ చేసుకున్నాడు. కానీ విదేశాల్లో ఆడిన మ్యాచ్‌లలో మాత్రం అంతగా రాణించలేక పోయాడు. విదేశాల్లో 13 టెస్టులు ఆడిన గిల్ కేవలం 649 పరుగులు మాత్రమే చేశాడు. ఇది అతని ఎంపిక అవకాశాలపై ప్రభావం చూపవచ్చు అని విశ్లేషకులు అంటున్నారు. అయితే ఇప్పటి వరకు టెస్ట్ క్రికెట్‌లో భారత్‌కు మూడు సార్లు కెప్టెన్‌గా వ్యవహరించిన బుమ్రా ఒక దానిలో విజయం సాధించి రెండింటిలో ఓటమి చవిచూశాడు. గాయం కారణంగా రోహిత్ దూరం కావడంతో ఇంగ్లండ్‌తో రీషెడ్యూల్ చేయబడిన ఐదవ టెస్ట్ మ్యాచ్‌కు తొలిసారి కెప్టెన్‌గా బుమ్రా వ్యవహరించాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్‌లో సారధిగా వ్యవహరించి టీమిండియాకు విజయాన్ని అందించాడు. ఇక సిడ్నీలో జరిగిన టెస్ట్‌కు రోహిత్ దూరం కావడంతో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన బుమ్రా..అదే మ్యాచ్‌లో గాయపడి జట్టుకు దూరమయ్యాడు. ఈ గాయం అతని కెప్టెన్సీ ఆశలను దూరం చేసింది.ఈ తరుణంలో భారత జట్టు కెప్టెన్ ఎంపిక బీసీసీఐకు తలనొప్పిగా మారింది

# ఫైనల్లో భారత మహిళలు



మన గళం : మహిళల ముక్కోణపు వన్డే టోర్నమెంట్‌లో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. బుధవారం సౌతాఫ్రికా మహిళలతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 23 పరుగుల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ఈ విజయంతో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 337 పరుగులు చేసింది. తర్వాత లక్షఛేదనకు దిగిన సౌతాఫ్రికా నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్లకు 314 పరుగులు మాత్రమే చేసి పరాజయం చవిచూసింది. ఈ ఓటమితో సౌతాఫ్రికా ఫైనల్ రేసు నుంచి వైదొలిగింది. ఇక ఆతిథ్య శ్రీలంక ఇప్పటికే తుది పోరుకు అర్హత సాధించింది. ఆదివారం భారత్‌శ్రీలంక జట్ల మధ్య ఫైనల్ సమరం జరునుంది. ఇక భారీ లక్షంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా విజయం కోసం తీవ్రంగా శ్రమించింది. అన్నెరి డర్క్‌సెన్, కెప్టెన్ చోల్ ట్రియాన్ అద్భుత పోరాట పటిమతో భారత బౌలర్లను హడలెత్తించారు. కీలక ఇన్నింగ్స్‌తో అలరించిన అన్నెరి 80 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 81 పరుగులు చేసింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన ట్రియాన్ 43 బంతుల్లోనే ఐదు సిక్సర్లు, 4 ఫోర్లతో 67 పరుగులు సాధించింది. ఇతర బ్యాటర్లలో మియానె స్మిత్ (39), తజ్మిన్ బ్రిస్ట్ (26), షంగెస్ (36) పరుగులు చేసినా ఫలితం లేకుండా పోయింది. టీమిండియా బౌలర్లలో అమన్‌జోత్ కౌర్ మూడు, దీప్తి శర్మ రెండు వికెట్లను పడగొట్టారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ ప్రతిక రావల్ (1), వన్‌డౌన్‌లో వచ్చిన హర్లిన్ డియోల్ (4) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (28) కూడా విఫలమైంది. ఇక కీలక ఇన్నింగ్స్ ఆడిన స్మృతి మంధాన ఆరు ఫోర్లతో 51 పరుగులు సాధించింది. మరోవైపు జెమీమా రోడ్రిగ్, దీప్తి శర్మ చిరస్మరణీయ బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. ధాటిగా ఆడిన రోడ్రిగ్స్ 101 బంతుల్లోనే 15 ఫోర్లు, ఒక సిక్స్‌తో 123 పరుగులు చేసింది. దీప్తి శర్మ 10 ఫోర్లు, రెండు సిక్సర్లతో 93 పరుగులు సాధించింది. దీంతో టీమిండియా స్కోరు 337 పరుగులకు చేరింది.

# శ్రీకాంత్, అస్మిత్ శుభారంభం



మన గళం : తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్, అస్మిత్ శెట్టి, మన్నేపల్లి శుభారంభం చేయగా.. మైస్నన్, సుబ్రహ్మణ్యం తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో శ్రీకాంత్ 21-16, 21-15తో సుబ్రహ్మణ్యంపై, అస్మిత్ శెట్టి 21-17, 21-18తో చెన్ లీ(తైపీ)పై విజయం సాధించారు. ఇక మన్నేపల్లి 21-17, 19-21, 21-12తో వాంగ్వా(జపాన్)పై గెలుపొందగా.. మైస్నన్ 21-23, 12-21తో కెనడాకు చెందిన యంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇక మహిళల సింగిల్స్‌లో హుడా సంచలనం సృష్టించింది. భారత్‌కే చెందిన అనుపమ ఉపాధ్యాయపై 21-13, 21-17తో విజయం సాధించి రెండోరౌండ్‌కు చేరింది. మరో పోటీలో ఆకర్షి కశ్యప్ 9-21, 12-21తో యంగ్(తైపీ) చేతిలో, అన్మోల్ ఖర్బ్ 17-21, 12-21తో నితిక్రరు(ఇండోనేషియా) చేతిలో ఓటమిపాలయ్యారు.

# కోల్‌కతాపై చెన్నై రెండు వికెట్ల తేడాతో గెలుపు

మన గళం : ప్లే-ఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్లు తడబడ్డారు. ప్లే-ఆఫ్స్ రేసునుంచి ఇప్పటికే నిష్క్రమించిన చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో రెండు వికెట్ల తేడాతో అనూహ్యంగా ఓటమిపాలై.. కోల్‌కతా ప్లే-ఆఫ్స్ ఆశలను మరింత సంక్లిష్టం చేసుకోగా.. చెన్నై సూపర్ కింగ్స్ ఖాతాలో మూడో విజయం నమోదైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని చెన్నై జట్టు 19.4ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. కెప్టెన్ అజింక్య రహానే (48బీ 33బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న కెకెఆర్ ఇన్నింగ్స్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్(11) త్వరగానే పెవిలియన్ చేరాడు. అనంతరం వచ్చిన సునీల్ నరైన్ (26, 17బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్) దూకుడుగా ఆడినా, నూర్ అహ్మద్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రఘువంశీ(1) కూడా నిరాశపరిచాడు. ఒక దశలో 71 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన కేకేఆర్‌ను కెప్టెన్ రహానే ఆదుకున్నాడు. అతనికి ఆండ్రీ రస్సెల్ (38, 21 బంతుల్లోబీ 4 ఫోర్లు, 3 సిక్సర్లు), మనీష్ పాండే (36 నాటౌట్, 28 బంతుల్లోబీ ఫోర్, సిక్సర్) తోడవడంతో జట్టు స్కోరు 150 పరుగులు దాటింది. రహానే అర్ధశతకానికి చేరువలో రవీంద్ర జడేజా బౌలింగ్‌లో కాన్వేకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చివర్లో రింకూ సింగ్ (9) వేగంగా ఆడే ప్రయత్నంలో నూర్ అహ్మద్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. రమణ్‌దీప్ సింగ్ (4 నాటౌట్) అజేయంగా నిలిచాడు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో నూర్ అహ్మద్ అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు కీలక వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కాంభోజ్, రవీంద్ర జడేజా చెరో వికెట్ దక్కించుకున్నారు.



Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310